
క్లుప్తంగా

నేడు తొలి ఏకాదశి పూజలు

నాదెండ్ల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. గణపవరం శివాలయంలో ఉదయమే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరగనున్నాయి. మండలంలోని అన్ని శైవక్షేత్రాల్లో ఏకాదశి సందర్భంగా భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

21న గురుపౌర్ణమి వేడుకలు



నాదెండ్ల: చిలకలూరిపేట నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు యూవీ శివరామయ్య తెలిపారు. మందిరం పైభాగాన 27 అడుగుల ఎత్తు గల నాగసాయి విగ్రహ ఐదో వార్షికోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఉదయం బాబా వారికి కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు, అనంతరం సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం బాబా వారికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

పైపులైన్ లీకులు అరికట్టాలి



చిలకలూరిపేట: మంచినీరు కలుషితం కాకుండా పైపులైన్ లీకులను సమర్థవంతంగా అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. నీటి సరఫరా సమయంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో క్లోరిన్ టెస్ట్, వాల్వ్ పిట్స్, పైపులైన్ లీకుల మరమ్మతు పనులను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో లీకుల కారణంగా నీరు కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉండే నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. వాల్వ్ పిట్స్‌లోకి బయట నీరు చేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకట రమణ, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జంతుప్రేమికుడు రమేష్ బాబు మృతి



నాదెండ్ల: జంతు ప్రేమికుడు కెల్లంపల్లి రమేష్ బాబు (55) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గణపవరం గ్రామానికి చెందిన కెల్లంపల్లి రమేష్‌బాబు గత 30 సంవత్సరాలుగా శునకాలు, కోళ్లు, పక్షులపై ప్రేమతో వాటిని సాకేవాడు. కోళ్లు, పుంజులను మేపి మొదట్లో విక్రయించే వాడు. ఆ తర్వాత శునకాలకు పాలు, బిస్కెట్లు వేసి ఆదరించేవాడు. తన ఇంటి పరిసరాల్లోని సుమారు 20 వరకూ శునకాలు రమేష్ బాబు చుట్టూ చేరేవి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వాటికి ప్రత్యేక శ్రద్ధతో పాలు, బిస్కెట్లు అందించేవాడు. అయితే గత కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. అయినప్పటికీ తన సంపాదనలో కొంతకాలాన్ని ఇప్పటి వరకూ జంతువుల కోసం ఖర్చు చేశాడు. మంగళవారం ఉదయం బజారు వెళ్ళి మందులు తెద్దామని బయలుదేరుతుండగా, గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు, కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వీరు హుటాహుటిన స్వగ్రామం గణపవరం చేరుకున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



నాదెండ్ల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ నాదెండ్ల సెక్టార్ ఏసీడీపీవో బి.నిర్మలారాణి చెప్పారు. మండలంలోని సాతులూరు అంగన్‌వాడీ సెంటర్‌లో మిషన్ శక్తి ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాలికలకు బాలల హక్కులు, వాటి ప్రయోజనాలు, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, గుడ్ టచ్–బ్యాడ్‌టచ్, రుతుక్రమంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రమాదేవి, కల్పన, సీహెచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మాస్ డ్రైవ్ నిర్వహిస్తాం

- ప్రతి వార్డును సచివాలయ ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలి
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: వచ్చే ఆగస్టు మొదటి వారంలో పట్టణంలో పారిశుద్ధ్యం బాగుకోసం 1000 మందితో మాస్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో సచివాలయ శానిటేషన్ సెక్రెటరీలు, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగీ లాంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. చుట్టుప్రక్కల ఉన్న ఆరు జిల్లాల్లో ఈ వ్యాధులు ప్రబలి ఉన్నాయన్నారు. ఈ నియోజకవర్గంలో ఇవి రాకుండా ముందుగానే నివారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంటువ్యాధులు అరికట్టేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. తాగునీటి సౌకర్యం, రహదారులు, పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చూస్తామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఐదారు వందలమందితో పారిశుద్ధ్యం శుభ్రంగా ఉండేలా డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ఇచ్చిన ఆదేశాల మేరకు పట్టణాన్ని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో దేవాలయాలు, మసీదుల వద్ద శుభ్రంగా ఉంచాలని సచివాలయ సెక్రెటరీలకు సూచించారు. తాము అధికారంలోకి వచ్చి 40 రోజులు అవుతుందని, పరిశుభ్రత కోసం కష్టపడుతున్నామన్నారు. అందరూ కలిసి కష్టపడి పనిచేసి బాగుచేద్దామన్నారు. రోడ్లపై నున్న గుంతలను పూడ్చేందుకు ఆ మార్గంలోని వ్యాపారుల సహకారం తీసుకుంటున్నామన్నారు. ప్రజల సమస్యలపై బాధ్యత తీసుకోవాల్సిన అవసరం సచివాలయ సెక్రటరీలకు ఉందన్నారు. ఆ బాధ్యత తీసుకోకపోతే తప్పకుండా మరో ప్రాంతానికి బదిలీ చేసే అవకాశం ఉందన్నారు. చాలామంది సచివాలయ ఉద్యోగులకు మంచిపేరు ఉందన్నారు. బాగా పనిచేసి దానిని నిలబెట్టుకోవాలని సూచించారు.

కోటప్పకొండలో తొలిఏకాదశి ఏర్పాట్లు పూర్తి

అనంతరం మీడియాతో మాట్లాడుతూ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు 20 వేల నుంచి 30 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం, దేవాలయ నిర్వహణా మండలి ఆధ్వర్యంలో ఆ రోజున గిరిప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆ మార్గంలో ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, వాసిరెడ్డి రవి, కట్టా కిరణ్ కుమార్, వేల్పుల సింహాద్రి యాదవ్, క్రాంతికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించరూ..!

తహసీల్దారుకు రైతుల వినతి



తహసీల్దార్ మొహమ్మద్ అఫ్రిఫున్నిసా బేగంకు సమస్యను వివరిస్తున్న రైతులు

యడ్లపాడు: పంట పొలాల్లో హైటెన్షన్ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన సమయంలో చెల్లించాల్సిన పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని రైతులు కోరారు. మంగళవారం రైతుసంఘం నాయకులతో కలిసి బాధిత రైతులు యడ్లపాడు తహసీల్దార్ మొహమ్మద్ అఫ్రిఫున్నిసా బేగంకు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అనంతరం పరిహారం విషయాలను ఆమెకు వివరించారు. 2018లో అప్పటి అమరావతి రాజధాని కోసం సత్తెనపల్లి నుంచి చినకోండ్రుపాడు వరకు ట్రాన్స్‌కో 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్మాణం చేపట్టింది. దీనికి సంబంధించి విద్యుత్ టవర్లు ఏర్పాటైన భూముల రైతులకు అప్పట్లోనే నష్టపరిహారం పంపిణీ చేశారు. అయితే విద్యుత్ తీగల కింద ఉండే భూములకు సదరు భూమి విలువలో 10 శాతం నష్ట పరిహారం అందజేయాలని లింగారావుపాలెం రైతులు న్యాయ పోరాటం చేశారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు 2022లో వారికి పరిహారాన్ని అందించింది. ఈనేపథ్యంలో అదే సమస్యను ఎదుర్కొంటున్న యడ్లపాడు, మైదవోలు, తిమ్మాపురం, కారుచోల, జగ్గాపురం, ఉన్నవ గ్రామాలకు చెందిన 225 మంది పలుమార్లు విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి దరఖాస్తులు అందజేసినా ఫలితం లేదు. రీసర్వే, కోవిడ్ తదితర కారణాలు చూపుతూ నేటికీ బాధిత రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఏడేళ్ల నుంచి పరిహారం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం దక్కలేదంటూ తహసీల్దార్ వద్ద రైతులు వాపోయారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతుసంఘం నాయకులతో కలిసి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి కల్లూరి రామారావు, రైతులు ముత్తవరపు సీతారామయ్య, వెంకట్రావు, జరుగుల శంకరరావు, పోపూరి సోమయ్య, గోనుగుంట్ల శ్రీధర్, శ్రీనివాసరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, గాండ్ల అనిల్, సుబ్బారావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు చర్యలు

వైద్యాధికారి రమ్య



మాట్లాడుతున్న వైద్యాధికారి రమ్య

శావల్యాపురం: కుష్ఠు వ్యాధి పూర్తిస్థాయిలో నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధిపై వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కుష్ఠు వ్యాధిపై ఈనెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో సర్వే జరుగుతుందన్నారు. శరీరంపై గోధుమ రాగి రంగు ఉండి స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తే కుష్ఠు వ్యాధి నిర్మూలన చేయవచ్చునన్నారు. ఇలాంటి లక్షణాలు కల్గిన వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారిని సమాచారం అందిస్తే ప్రభుత్వ పరంగా ఉచితంగా వైద్య పరీక్షలు సేవలతో పాటు మందులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

చిలకలూరిపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు విద్యుత్ ఈఈ సీహెచ్ రమేష్ తెలిపారు. చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయం వద్ద ఉన్న విద్యుత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు ఎన్.విక్టర్ ఇమాన్యుయేల్ పాల్గొంటారని, చిలకలూరిపేట డివిజన్‌తో పాటు గుంటూరు–1 పరిధిలోని జోకిపత్రు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టి చెరుకూరు ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నేడు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని దేవస్థానం చైర్మన్ పొత్తూరి వెంకట రమసుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ

నరసరావుపేట: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించే నాలుగో విడత క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్టీలో స్వేచ్ఛ వాతావరణం, నాయకులు, కార్యకర్తల మధ్య సమానత్వం ఉందన్నారు. గతంలో పార్టీలో సభ్యతం ఉన్న వారు మళ్లీ రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 28 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందనీ, కొత్తగా చేరాలనుకునే వారు తమ ఆధార్ కార్డుతో పాటు నామిని ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నంబరు, రూ.500లు సభ్యత రుసుము చెల్లించాలని కోరారు. వీరికి పార్టీ తరపున బీమా సౌకర్యం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు జీవీఎస్ ప్రసాద్, జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి షేక్ ఆఫ్రుఫ్, నాయకులు సాంబశివరావు, అళ్ళ శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, మేడిశెట్టి. రామారావు, చిందుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీల సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28 వరకు నాల్గో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు నిర్వహిస్తామన్నారు. గతంలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారు కూడా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. జనసైనికులు, వీర మహిళలు సమిష్టిగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



రొంపిచర్ల : మండలంలోని విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట, రొంపిచర్ల, మునమాక తదితర గ్రామాల్లో మంగళవారం పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 9వ సరగత్ సందర్భంగా మండల కేంద్రమైన రొంపిచర్లలో గల పెద్ద చావిడి, దూదేకుల చావిడిలలో గల పీర్లను రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు చేశారు. కనక తప్పెట్లతో, సన్నాయి మేళాలతో పీర్ల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగింది. పీర్లను ఎత్తుకుని యువకులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తమ ఇళ్ల ముందుకు వచ్చిన పీర్లకు గ్రామస్తులు తమకు తోచిన విధంగా వస్తు, ధన రూపంలో కానుకలను అందజేశారు.

నాణ్యమైన మిరపనారే అందించండి

షేడ్‌నెట్ యజమానులకు ఉద్యాన శాఖ ఆదేశం



షేడ్‌నెట్ యజమానులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి కిషోర్‌కుమార్

నాదెండ్ల: నాణ్యమైన మేలుజాతి కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసి నర్సరీ యజమానులు మిరప నారును రైతులకు విక్రయించాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.కిషోర్ కుమార్ చెప్పారు. నాదెండ్లలోని షేడ్‌నెట్‌లను ఆయన మంగళవారం పరిశీలించారు. యజమానులకు పలు సూచనలు చేశారు. నారు పోసిన నాటి నుంచి మొక్కయ్యే వరకూ నర్సరీ యజమానులు పలు సూచనలు పాటించినట్లయితే మంచి మొక్కలు అందించవచ్చన్నారు. నర్సరీ యజమానులు కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయాలని, ఇన్‌సెక్ట్ ప్రూఫ్ నెట్లను వినియోగించాలన్నారు. షేడ్ నెట్ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని, నారును విక్రయించిన రైతులకు సంబంధిత బిల్లులు అందించాలన్నారు. ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నారుకు బయో మందులు వినియోగించకూడదన్నారు. షేడ్‌నెట్‌ల వద్ద స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఉంచాలని యజమానులకు సూచించారు. ఆయనతో పాటూ నాదెండ్ల ఉద్యానవనశాఖ సహాయకులు ఉన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, తొండపి, లంకెలకూరపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను గ్రామ సభలో వినిపించారు. మస్టర్ షీట్‌లో నిర్వహణ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. లంకెలకూరపాడులో జరిగిన గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి హాజరు కాకుండా ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద రికార్డులు అప్పగించలేదని సభలో సభ్యులు వివరించారు. పని ప్రాంతాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన విజిటర్ల రికార్డుల నిర్వహణలోనూ లోపాలున్నట్లుగా గుర్తించారు. గ్రామ సభలో ఎస్సార్పీ ఎం.లోకేష్, డీఆర్పీలు శివ, శరత్‌కుమార్, తిరుపాల్, కిషోర్, ఆయా గ్రామాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

సత్తెనపల్లి: దళిత బాలికపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు మంగళవారం డిమాండ్ చేశారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న బాలికను అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన గ్యాస్ డెలివరీ బాయ్‌ను వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్ట్ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని, ఆ కుటుంబానికి న్యాయం జరగని పక్షాన రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

క్రోసూరు: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న యువ కౌలు రైతు సోడిసెట్టి గోపాలకృష్ణ(26) మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన గోపాలకృష్ణ వ్యవసాయంలో అప్పులు ఎక్కువ కావటంతో మనస్థాపానికి గురై ఈ నెల 10వ తేదీ ఇంటి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి గుర్తించిన కుటుంబీకులు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం కలరు. ఆసుపత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలు అప్రమత్తతతో మెలగాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం

అచ్చంపేట: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింస, అక్రమ రవాణా వంటి చర్యల పట్ల మహిళలు అప్రమత్తంగా మెలగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలిక పాఠశాల/జూనియర్ కళాశాలలో సంకల్ప మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మీ సమీపంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రుతుక్రమంపై అపోహలు, పాటించవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా అధికారిపై దుష్ప్రచారం తగదు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు



సమావేశంలో పాల్గొన్న దాసు తదితరులు

క్రోసూరు: దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న గిరిజన మహిళా అధికారిపై కొన్ని మీడియా సంస్థలు టార్గెట్ చేయడం నీచమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి గిరిజన మహిళ కాబట్టి ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ కొన్ని మీడియా సంస్థలు ఆమె వివరణ తీసుకోకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయటం నీచమైన చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి తప్పుడు ప్రచారం చేసిన మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బంకా శ్రీనివాసరావు, సబ్దసాత్ రవి నాయక్ , వట్టిపు మరియదాసు పాల్గొన్నారు.

నేడు మొహర్రం పండగకు సిద్ధం



దొడ్లేరులోని పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లు

క్రోసూరు: మొహర్రం పండగ బుధవారం ఘనంగా నిర్వహించుకునేందుకు గ్రామాల్లో పీర్ల చావిడ్లు సిద్ధమయ్యాయి. మత సామరస్యానికి ప్రతీకగా గ్రామాల్లో ప్రజలందరూ నిర్వహించుకునే పండగ మొహర్రం. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామే హుస్సేన్, అతని కుటుంబీకులు యావత్తు కర్బల మైదానంలో జరిగిన విద్రోహ చర్య కారణంగా అసువులు బాసిన సందర్భంగా వారిని స్మరించుకుంటూ 10 రోజుల పాటు సంతాప దినాలు నిర్వహించుకోవటమే పీర్ల పండగ విశిష్టత. మండలంలోని క్రోసూరు, దొడ్లేరు, హసనాబాద్, గుడిపాడు, నాగవరం తదితర గ్రామాల్లో పీర్ల పండగ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

రాజుపాలెం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని పిడుగురాళ్ల బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు తెలిపారు. మండలంలోని గణపవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించక పోవడం వలన యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని తెలిపారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించక పోవడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్ష పడే విధంగా చట్టాలున్నాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు

అమరావతి: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరాదని, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మోటారు వాహనాల చట్టం గురించి మంగళవారం అమరావతిలో శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటిరచాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని అందువల్ల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో అమరావతి ఎస్సై సీహెచ్ ప్రసాద్ రెడ్డి, కోట బాబురావు పాల్గొన్నారు.